క్లుప్తంగా

త్వరలో రాష్ట్రపతిని కలవనున్న గిరిజనులు

సీతంపేట: ట్రైకార్ సంస్థ ఆధ్వర్యంలో ఐటీడీఏ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పది మంది గిరిజనులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవడానికి త్వరలో న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నట్టు ఐటీడీఏ వర్గాల ద్వారా తెలిసింది. సీతంపేట, మందస, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి తదితర మండలాలకు చెందిన ఒక్కో గ్రామం నుంచి ఒక్కొక్కరు వెళ్లనున్నట్టు సమాచారం. రైతులు, చిత్రకారులు, వేతనదారులు, డిగ్రీ విద్యార్థులు, బీటెక్, డిప్లమా, వీడీవీకేల నుంచి సభ్యులు వెళ్లనున్నారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే వివిధ సమస్యలపై రాష్ట్రపతి దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు సమాచారం.

ఏజెన్సీలో 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు

గుమ్మలక్ష్మీపురం: రానున్న ఖరీఫ్ కోసం రైతులకు కావాల్సిన వరి, వేరుశనగ విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేపట్టనున్నట్లు... ఇందుకు తగిన ఏర్పాట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చేశారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు. స్థానిక విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో అదునులో విత్తనాలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడేవారని, ఇప్పుడైతే విత్తనం కోసం ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో సీఎం జగనన్న ఆదేశాల మేరకు సీజన్ కంటే ముందుగా విత్తనాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీపైన, కంటింజెన్సీ కింద ఇచ్చే విత్తనాలను 80 శాతం సబ్సిడీపైన ఇవ్వనున్నట్లు వివరించారు. ఆర్బీకేల్లో రైతుల నమోదుతో పాటు, విత్తనాల పంపిణీ చేయనున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నారావు సూచించారు.

చిన్నారులకు అభినందనలు



చిన్నారులకు అభినందనలు తెలుపుతున్న ఎస్ఐ ప్రసాద్

కురుపాం: కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన కురుపాంకు చెందిన పది మంది చిన్నారులకు ఎస్ఐ సి.హెచ్.ప్రసాద్ శుక్రవారం అభినందించారు. విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో గత నెల 26, 27, 28వ తేదీల్లో ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 10, 14, 19 విభాగాల్లో కురుపాంకు చెందిన మన్యం కరాటే చాంపియన్ డోజో తరపున స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరంలో శిక్షణ ఇచ్చిన కోలక నరేష్ ఆధ్వర్యంలో చిన్నారులు పోటీల్లో పాల్గొని బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మలేరియా మాసోత్సవాలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

సీతంపేట: మలేరియా నిర్మూలనా మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి అన్నారు. స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లకార్డులు, బ్యానర్లు, స్లోగన్స్‌తో ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతీ ఇంట్లో రక్త నమూనాలు సేకరించాలన్నారు. దోమలు పెరగకుండా శానిటైజేషన్ కమిటీలతో దోమలను నివారించాలన్నారు. గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంలో కాలువల్లో పూడికతీత చేపట్టాలన్నారు. దోమతెరలు అందరూ వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, డీఎల్‌డీఓ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సత్యం, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లు సక్రమంగా వేయాలి



సిరికొండ వద్ద ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ఉపాధి పనులు జరిగేచోట వేతనదారులకు సక్రమంగా మస్తర్లు వేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలంలోని సిరికొండ, వెలగవాడ, గోపాలపురం తదితర గ్రామాల్లో ఎంపీడీఓ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వేతనదారుల హాజరు, అందుబాట్లో ఉన్న మౌలిక సదుపాయాపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ సిబ్బంది పనులు జరిగే చోట కచ్చితంగా ఉండాలన్నారు. రోజువారీ నివేదికలు, పనుల తాజా పురోగతి తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

● మేమున్నామంటూ...

జగనన్న రథసారధులైన వలంటీర్లు పింఛన్ల పంపిణీలో గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు నగదు రెండో రోజు శుక్రవారం కూడా అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇలా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: కూరాకుల వీధిలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తూముల నరేంద్ర



వీరఘట్టం: సెగిడివీధిలో వృద్ధురాలికి పెంఛన్ అందజేస్తున్న వలంటీరు పోలిరాజు



భామిని: సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడు వరణీతేజ్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్య పింఛన్ రూ.10వేలు పింఛన్ అందజేస్తున్న ఉప సర్పంచ్ తిరుమలరావు

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

భామిని: భామిని, బిల్లుమడ గ్రామాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహనదారులకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్ఐ తులసి నాయుడు, సిబ్బంది ఉన్నారు.

పనులను వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: నాడు – నేడు రెండో విడత ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో హెచ్ఎంలు, సీఆర్పీలు, సిబ్బందితో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణలో నాణ్యతా లోపాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. పనుల నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు పనులు అభివృద్ధికి సూచికలుగా ఉందన్నారు. దీన్ని అందరూ గుర్తించి నాడు – నేడు పనులు నాణ్యతతో చేయాలన్నారు.

పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిశీలిస్తూ ఉండాలన్నారు. నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేయాలని అన్నారు. సమావేశంలో ఎంఈఓ ఎస్.నాగభూషణరావు, జేఈ ఎం. రామారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వితరణ



సీహెచ్‌సీకి వాటర్ ప్యూరిఫైర్ అందజేస్తున్న వెంకన్న

కురుపాం: మండల కేంద్రానికి చెందిన కందుల వెంకటరమణ (వెంకన్న) అనే వ్యాపారి తన తల్లి కందుల బంగారమ్మ జ్ఞాపకార్థం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం వాటర్ ప్యూరిఫైర్‌ను వితరణగా వైద్య సిబ్బందికి అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి నాలుగు గిరిజన మండలాల నుండి గిరిజన రోగులు వస్తున్నారని వారికి వేడి నీటిని, చల్లటి నీటిని సరఫరా చేసేందుకు సద్వినియోగ పరచాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు సద్వినియోగం కావాలి



వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

గుమ్మలక్ష్మీపురం: వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఈ మేరకు వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కంపోనెంట్‌లో భాగంగా ప్రధానమంత్రి సంచాయి యోజన 2.0 (పీఎస్ఐ) ద్వారా గుమ్మలక్ష్మీపురం ప్రాజెక్ట్‌లోని 10 పంచాయతీలకు చెందిన గిరిజన రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. వాటర్‌షెడ్ పథకం ప్రాజెక్ట్ ఆఫీసర్ రెడ్డి పోలినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రైతులకు టార్పలిన్లు, ఫుట్ బ్యాటరీ స్ప్రెయర్లు, ఫుట్ స్ప్రెయర్లు, ఆయిల్ ఇంజిన్లు వంటి వ్యవసాయ పరికరాలను అందజేశారు. రైతులంతా సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో ముందుకు సాగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, ఎంపీడీఓ సాల్మన్‌రాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు, పలువురు సర్పంచ్లు పాల్గొన్నారు.

రహదారి పనుల నాణ్యత పరిశీలన



పాలకొండ – రాజాం రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పాలకొండ – రాజాం రహదారిలో స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి రేగిడి మండలం సంకిలి వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర చేపడుతున్న రహదారి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నట్లు ఆర్అండ్‌బీ జేఈ జంపాన జగన్మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం పనుల నాణ్యతను అధికారి తన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ రహదారిలో ఏర్పడ్డ గోతులు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.3.75కోట్ల మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ వ్యయంతో పనులు చేపట్టామని తెలిపారు. నీటి ప్రవాహం కారణంగా తరుచూ ఛిద్రమవుతున్న చోట సిమెంట్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో రహదారిని ప్రజలకు అందుబాట్లోకి తీసుకువస్తామన్నారు.

మలేరియాకు చెక్ పెడదాం



కురుపాం : నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో స్ప్రేయింగ్

కురుపాం: మలేరియా నివారణకు ప్రతీ ఒక్కరూ తమ ఇంట్లో స్ప్రేయింగ్ చేయించుకోవాలని నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అమర సింహారెడ్డి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, మహేంద్రపురం గిరిజన గ్రామాల్లో ఏసీఎం ఐదు శాతం స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని మలేరియ సబ్ యూనిట్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, వసతిగృహ సంక్షేమ అధికారులు చిలకమ్మ, మల్లేశ్వరరావు, సూపర్‌వైజర్ గౌడు శ్రీహరిరావు, ఏఎన్ఎం సుజాత, జానకి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ ఒక్కరూ దోమల నివారణపై దృష్టి సారించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్, పావని అన్నారు. మండలంలో రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ నెల 30వ తేదీ వరకు అవగాహన ర్యాలీని గ్రామాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌కు బదిలీ

సీతంపేట: స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరికి విజయనగరం బదిలీ అయ్యింది. ఈ స్థానంలో విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గోపాల్‌కృష్ణ బదిలీపై రానున్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



నవధాన్యాల కిట్లను అందజేస్తున్న ఏఏఓ గాయత్రి దేవి

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవసరమైన నవధాన్యాల కిట్లను గ్రామ వ్యవసాయ సహాయకురాలు గాయత్రి దేవి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉభాలకు ముందు పంట పొలంలో వేసుకొని ఉభాలు చేసే ముందు కలియ దున్నాలన్నారు. దీనివల్ల భూమికి నత్రజని, భాస్వరం తదితర పోషకాలు అందుతాయన్నారు. నవధాన్యాల కిట్లను వినియోగించడం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చునన్నారు. పంపిణీలో ఐసీఆర్పీ ఇందిర ఉన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

సీతంపేట: ఆటో ఢీకొన్న సంఘటనలో రాణిపేటకు చెందిన ఎ.షన్ముఖరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... కొత్తూరు నుంచి సీతంపేట వస్తున్న ఆటో ఎదురుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న షన్ముఖరావును శుక్రవారం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కొత్తూరు సీహెచ్‌సీలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించినట్టు ఎస్ఐ ఎ.నీలకంఠరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎంపీటీసీ సుశీలమ్మ మృతికి సంతాపం



నిమ్మల సుశీలమ్మ (ఫైల్)

భామిని: మండలంలోని బత్తిలి 1 ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మల సుశీలమ్మ(65) అనారోగ్యంతో స్వగృహంలో శుక్రవారం మృతి చెందారు. సుశీలమ్మ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీగా గత ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. సుశీలమ్మకు భర్త నిమ్మల భాస్కరరావు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, బత్తిలి 2 ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారి పరామర్శించి తమ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబానికి తమ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహు, సచివాలయ కన్వీనర్లు పత్తిక దాస్, రాగోలు రాధాకృష్ణ సంతాపం తెలిపారు.

సాంబన్నవలసలో ఫ్రైడే.. డ్రైడే

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట పంచాయతీ సాంబన్నవలసలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీని నిర్వహించి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా మంచినీటి బావులు, బోరుబావులు సమీపంలో మురుగునీరు నిల్వ వుండకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక భరోసా



స్నేహితుని కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ ధ్రువ పత్రాలు అందజేస్తున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు

పాలకొండ రూరల్: తమతో పాటు చదువుకుని ఇటీవల మృతి చెందిన కొచ్చర్ల వేణు(43) కుటుంబ సభ్యులను సహచర మిత్రులు, పాలకొండకు చెందిన 1994 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వపు విద్యార్థులు శుక్రవారం వారి స్వగృహంలో కలిశారు. మిత్రుని మృతికి గల కారణాలు తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తమ స్నేహితునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గుర్తించారు. వారికి తమవంతు సాయం అందించాలని నిర్ణయించారు. ఇది వరకే వారు ఏర్పాటు చేసుకున్న హెల్పింగ్ హేండ్స్ గ్రూప్ ద్వారా రూ.లక్షా 27వేలను సేకరించి మరణించిన స్నేహితుని పిల్లల పేరిట డిపాజిట్ చేశారు. సదరు ధ్రువపత్రాలను స్నేహితుని కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పూర్వపు స్నేహితులు మండపాక శ్రీధర్, డి.రాంప్రసాద్, జోగి రాజేష్ తదితరులున్నారు. సహకరించిన తోటి మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి



ఉల్లిభద్రలో మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ రామకృష్ణ

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీఓ టి.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనం గిట్టుబాటు అయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు ముందుగా కొలతలు ఇవ్వాలన్నారు. వేతనదారులకు ఎస్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్తర్లలో అటెండన్స్ వేయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా రెండు పూటలా ఉపాధిప నుల్లో పాల్గొనాలన్నారు. ఎఫ్ఏ స్వాతి తదితరులున్నారు.

భూ యజమానులు అందుబాటులో ఉండాలి



సమగ్ర సర్వేలో అధికారులకు వివరాలు అందిస్తున్న భూ యజమానులు, రైతులు

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి భూ యజమానులు అందుబాట్లో ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి.బుచ్చయ్య అన్నారు. పట్టణ శివారు ప్రాంతమైన రాజుపేట కూడలి నుంచి అన్నవరం గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 170 నుంచి 200 మధ్య రీ సర్వే చేపట్టారు. దాదాపు 90 ఎకరాల వివరాలను సంబంధిత భూ యజమానులు, రైతుల సమక్షంలో నమోదు చేశారు. శనివారం రెండు ప్రత్యేక సర్వే బృందాలు ఇదే సర్వే నంబర్లకు సంబంధించిన మిగులు భూముల్లో సర్వే చేపడతారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మొబైల్ డీటీ పి.సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్ఓ బలివాడ సాయి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆలయ తొలగింపు నిర్ణయంపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వున్న త్రినాధస్వామి ఆలయాన్ని తొలగించే ఆలోచనను ఆర్టీసీ అధికారులు విరమించుకోవాలని గుమ్మలక్ష్మీపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో సుధాకర్ కాంప్లెక్స్ ఆవరణలోని ఆలయం వద్ద గల చిత్రపటాలను శుక్రవారం తొలగించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గతంలో గ్రామ పెద్దలు, దాతలు ఆర్టీసీ కాంప్లెక్స్ కోసం స్థలాన్ని ఇచ్చారని, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందే ఆ స్థలంలో ఆలయం ఉందన్నారు. ఆలయం తొలగించాలని ప్రయత్నించి హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

పని ప్రదేశంలో తాగునీరు ఏర్పాటు చేయాలి



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ బాలకృష్ణ

కొమరాడ: ఉపాధి హామీ పథకంలో వేతనదారులు పని చేస్తున్న ప్రదేశాల్లో తాగునీటి ప్యాకెట్లను కచ్చితంగా అందుబాటులో ఉంచాలని ఏపీఓ బాలకృష్ణ సిబ్బందికి సూచించారు. మండలంలోని చినఖేర్జల పంచాయతీ రేగులపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే సుమారు 6వేల మంది వేతనదారులు పని చేస్తున్నారన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వేతనదారులు 10గంటలలోగా పనులను ముగించుకొని ఇంటికి వెళ్లాలన్నారు. పని ప్రదేశంలో టార్పాల్లతో నీడను కల్పించుకోవాలన్నారు. క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు ఇచ్చిన కొలతల మేరకు పనులు చేపట్టాలన్నారు.

తోటపల్లిలో పాణిహాటి పండగ



తోటపల్లిలో నితాయి గౌరంగ అభిషేకానికి స్థలాన్ని పరిశీలిస్తున్న హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శోభకృత నామసంవత్సరం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 4వ తేదీన పాణిహాటి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ బీఎల్ నగేష్ తెలిపారు. స్వామివారు నితాయి, గౌరంగ(శ్రీకృష్ణ బలరాములు) విగ్రహాలకు పల్లకిలో ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహాలకు అభిషేకం, వివిధ పల్ల రసాలు, నదీ జలాలు, పంచగవ్యాలు వివిధ పుష్పాలతో మంత్రోచ్ఛరణలతో అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు ఎదురాజ దాస, తదితరులు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి

● విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విజయ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి బొత్స, ఎమ్మెల్యే కళావతి, ఆసత్రి యాజమాన్య సభ్యులు తదితరులు

పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని, అందుకు అనుగుణంగా పేదలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యన్నారాయణ విజయ ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని మంత్రి బొత్స శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పించి సేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రైవేటు ఆస్పత్రిల్లో ఆరోగ్యశ్రీ సేవలను ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామని తెలిపారు.

అనంతరం ఆస్పత్రిలో పలు విభాగాలను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పల్సస్ సంస్థల అధినేత గేదెల శ్రీనుబాబు, కాళింక కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌లతో పాటు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఏపీపీ కిమిడి సూర్య, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, చైర్మన్ యందవ రాధాకుమారి, డీఎస్పీ కృష్ణారావు, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మావతి, మేనేజర్ రాంబాబు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.